www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -9 బుధవారం 9 ఏప్రిల్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

## బాంబు పేలుళ్ల ముష్కరులకు
# ఉరిశిక్ష



**దిల్‌సుఖ్ నగర్ బాంబ్ బ్లాస్ట్ కేసులో సంచలన తీర్పు**

**ఎన్ఐ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**-అప్పీల్‌ను తిరస్కరిస్తూ..ఉరిశిక్ష వేసిన హైకోర్టు**



హైదరాబాద్,ఏప్రిల్8(ప్రజావినికిడి,:
దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ బాంబు బ్లాస్ట్ కేసులో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో నిందితులను దోషులుగా నిర్ధారించిన హైకోర్టు.. వారు వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఐదుగురు దోషులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించింది. ట్రయల్ కోర్ట్ ఇచ్చిన తీర్పును జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధతో కూడిన ధర్మాసనం ధర్మాసనం సమర్థించింది. అలాగే ఉరిశిక్షను ఖరారు చేసింది. మిగతాది 2లో...

# అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం- గెజిట్ విడుదల

వక్ఫ్ సవరణ చట్టం-2025 అమల్లోకి వచ్చింది. ఈ చట్టానికి సంబంధించిన బిల్లు ఇటీవల పార్లమెంటు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. దీనిని అమల్లోకి తీసుకువస్తూ కేంద్ర ప్రభుత్వం నేడు నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంటు ఉభయ సభల నుంచి ఆమోదం పొందిన ఈ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ సవరణ బిల్లు చట్టంగా మారింది.ఈ చట్టాన్ని నేటి నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్లు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తెలియజేసింది.మరోవైపు, ఈ వక్ఫ్ చట్టంపై కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించి మొత్తం 15 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ చేపట్టనుంది. కేంద్ర ప్రభుత్వం కూడా కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయవద్దని సుప్రీంకోర్టును కోరింది.

## కంచ భూముల్లో
# భూకుంభకోణం

**25 ఏళ్లు పూర్తిచేసుకున్న పార్టీ బిఆర్ఎస్**

**టిడిపి తరవాత తమదే సీనియర్ పార్టీ**

**ఏడాది పాటు పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు**

**ప్రధాన ప్రతిపక్ష పాత్రను బాధ్యతగా పోషిస్తున్నాం**

**సెంట్రల్ వర్సిటీ భూములపై విద్యార్థులే పోరాడారు**

**కేసులు ఎలా పెటాలన్న ఆలోచనలో ప్రభుత్వం**

**మీడియాతో చిట్‌చాట్‌లో కెటిఆర్**






హైదరాబాద్ఏప్రిల్8(ప్రజావినికిడి,: : కంచ గచ్చిబౌలి భూముల వెనుక రూ.వేల కోట్ల బాగోతం ఉంద ని త్వరలో భారీ భూ కుంభకోణాన్ని బయటపెడతానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూ మి వెనుక వేల కోట్ల వ్యవహారం ఉందని పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో బిజెపి ఎంపీ ఉన్నారని చెప్పారు. రెండు జాతీయ పార్టీల జుట్టు ఢిల్లీ చేతిలో ఉందని, ఒకరు ఢిల్లీ నేతల చెప్పులు మో స్తే.. మరొకరు ఢిల్లీకి బ్యాగులు మోస్తున్నారని చు రకలు అంటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడి 16 నెలలైనా మంత్రివర్గాన్ని విస్తరించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లినా ఒక్క రూపాయి కూడా రాలేదని అన్నారు. హెచ్‌సియు వ్యవహారంలో సిఎం రేవంత్‌రెడ్డి విఫలమైనందునే హైకమాండ్ జోక్యం చేసుకుంటోందని,అందుకే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్షలు చేస్తున్నామని ఆరోపించారు. మిగతాది 2లో...

## యూనివర్సిటీల్లో 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్8(ప్రజావినికిడి,:
తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ పునర్నిర్మాణం వైపు ప్రజా ప్రభుత్వం బలమైన అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ట్విట్టర్ వేదికగా ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు విడుదల చేసినట్టు తెలిపారు. ఈ పక్రియను 15 సంవత్సరాల పాటు- నిర్వహించకపోవడం నిజంగా షాకింగ్ అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ పాలనలో విద్య రంగం పట్ల చూపిన నిర్లక్ష్యం పేద బిడ్డల భవిష్యత్‌ను దెబ్బతీసిందని సీఎం విమర్శించారు. ఇది క్షమించలేని నేరమని ఆయన పేర్కొన్నారు.మిగతాది 2లో...



# ఈనెల 10 నుంచి
## రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

- **ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు..**
- **చట్టసవరణ తో డబుల్ రిజిస్ట్రేషన్ కు చెక్..**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..**

హైదరాబాద్,ఏప్రిల్8(ప్రజావినికిడి,:
రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా సేవలు అందించేందుకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ఆధునీకరణ కొనసాగుతున్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



## మతపరమైన విభజనతో
# సమస్యలు పక్కదారి

- పటేల్ సిద్ధాంతానికి..ఆర్ఎస్ఎస్ భావజాలం వ్యతిరేకం
- జాతీయ నేతలపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల కుట్రలు
- పటేల్, నెహ్రూ సాన్నిహిత్యం గురించి వారికేం తెలుసు
- కాంగ్రెస్ కార్యవర్గ భేటీలో ఖర్గే అధ్యక్షోపన్యాసం




## మతపరమైన విభజనతో
# సమస్యలు పక్కదారి




- పటేల్ సిద్ధాంతానికి..ఆర్ఎస్ఎస్ భావజాలం వ్యతిరేకం
- జాతీయ నేతలపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల కుట్రలు
- పటేల్, నెహ్రూ సాన్నిహిత్యం గురించి వారికేం తెలుసు
- కాంగ్రెస్ కార్యవర్గ భేటీలో ఖర్గే అధ్యక్షోపన్యాసం

అహ్మదాబాద్,ఏప్రిల్8(ప్రజావినికిడి,:
సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సిద్ధాంతం ఆర్ఎస్ఎస్ భావజాలానికి భిన్నమైనదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పష్టం చేశారు. స్వాతంత్యోద్యమంలో 'ఏమాత్రం పాత్ర లేని' సంస్థ పటేల్ వారసత్వం గురించి చెప్పుకోవడం హాస్యాస్పదం అని ఖర్గే అన్నారు.బిజెపి, ఆర్ఎస్ఎస్ జాతీయ హీరోలకు వ్యతిరేకంగా 'పక్కా కుట్ర' సాగించాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మంగళవారం ఆరోపించారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ మెమోరియల్‌లో విస్తృత కాంగ్రెస్ కార్యవర్గం (సిడబ్లుసి) సమావేశంలో ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ, ఇప్పుడు మతపరమైన విభజనకు పాల్పడడం ద్వారా దేశంలోని మౌలిక సమస్యల నుంచి దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. నెహ్రూ- పటేల్ మధ్య నిత్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. అన్ని విషయాలపై నెహ్రూ ఆయన సలహాలు తీసుకునే వారు. పటేల్ అంటే ఆయనకు అమితమైన గౌరవం. ఏదైనా సలహా తీసుకోవాల్సి వస్తే స్వయంగా నెహ్రూనే పటేల్ ఇంటికి వెళ్లేవారు.
మిగతాది 2లో...

## చిన్న తప్పు చేసినా
# వీసా రద్దు!...
### అమెరికాలో భారతీయ విద్యార్థుల్లో ఆందోళన



## సింగపూర్‌లో అగ్నిప్రమాదం...



**స్కూలులో జరిగిన అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్**

**ప్రమాదంలో బాబు చేతులు, కాళ్లకు గాయాలు**

**ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో చికిత్స**

**ప్రమాదం ఇంత తీవ్రంగా ఉందనుకోలేదు**

**అకీరా బర్త్‌డే రోజే ఇలా జరగడం విచారకరం**

**కుమారుడికి గాయాలపై పవన్ వెల్లడి**

# బాంబు పేలుళ్ల ముష్కరులకు ఉరి

(మొదటి పేజి తరువాయి)
సుమారు 45 రోజుల పాటు హైకోర్టు సుదీర్ఘంగా విచారణను జరిపింది. 2016 డిసెంబర్ 13న ఐదుగురు నిందితులను దోషులుగా గుర్తించి ఉరిశిక్ష విధిస్తూ ఎన్ఐఏ కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో నిందితులు సవాల్ చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం తీర్పును వెల్లడించింది. బాంబ్ బ్లాస్ట్‌లో వీరి కుట్రను గుర్తించి దోషులుగా తేల్చింది. ఈ ఐదుగురికి ఉరిశిక్ష ఖరారు చేస్తూ హైకోర్టు ధర్మాసనం తీర్పును వెల్లడించింది. పేలుళ్లకు పాల్పడ్డ ఐదుగురికి ఉరి శిక్ష సరైనదేనని సంచలన తీర్పునిచ్చింది. 2013లో దిల్‌సుఖ్‌నగర్‌లో పేలుళ్లు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ పేలుళ్లలో 18 మంది మృతి చెందగా, 130 మందికి గాయాలు అయ్యాయి. ఈ విషాద ఘటన నగర ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. 2016లో ఫాస్ట్‌ట్రాక్‌కోర్టు యాసిన్ భత్కల్ సహా ఐదుగురికి ఉరిశిక్ష విధించింది. అయితే కింది కోర్టు తీర్పుపై ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించారు. ప్రధాన నిందితుడు రియాజ్‌భత్కల్ ఇప్పటికి పరారీలో ఉన్నాడు. ఈ జంట పేలుళ్లకు ప్రధాన కారకుడైన యాసిన్ భత్కల్ అని పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాపులో, మిర్చిపాయింట్ వద్ద జరిగిన జంట పేలుళ్లలో 18 మంది మృతి చెందగా, 131 మంది గాయపడ్డారు. ఉరిశిక్ష పడిన నిందితుల్లో అసదుల్లా అక్తర్ అలియాస్ హద్ది, జియా ఉర్ రహమాన్ అలియాస్ వఘాస్ అలియాస్ నబీల్ అహమ్మద్, మహ్మద్ తహసీన్ అక్తర్ అలియాస్ హసన్ అలియాస్ మోను, యాసిన్ భత్కల్ అలియాస్ షారూఖ్, అజాజ్ షేక్ అలియాస్ సమర్ ఆర్మాన్ తుండె అలియాస్ సాగర్ అలియాస్ ఐజాజ్ సయ్యద్ షేక్ ఉన్నారు. అనంతరం ఉరిశిక్ష ధ్రువీకరణ నిమిత్తం ఎన్ఐఏ కోర్టు తీర్పును హైకోర్టుకు నివేదించింది. దీంతోపాటు ఐదుగురు నిందితులు కింది కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధలతో కూడిన ధర్మాసనం సుమారు 45 రోజులపాటు సుదీర్ఘ విచారణ జరిపి తీర్పు వాయిదా వేసింది. నేడు ఎన్ఐఏ కోర్టు తీర్పును సమర్థిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



# సింగపూర్‌లో అగ్నిప్రమాదం...

హైదరాబాద్, ఏప్రిల్8(ప్రజావినికిడి,:సింగపూర్‌లోని స్కూల్‌లో అగ్ని ప్రమాదం కారణంగా కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌కు గాయాలు కావడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తొలిసారి స్పందంచారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అరకు పర్యటనలో ఉండగా తనకు ఫోన్ వచ్చిందని తెలిపారు. తన కుమారుడు మార్క్ శంకర్ స్కూల్‌లో అగ్నిప్రమాదం జరిగిందని తెలిపారన్నారు. ఈ ప్రమాదంలో మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు గాయాలయ్యాయని వివరించారు. అయితే ప్రమాదం తీవ్రత ఇంతలా ఉంటుందని తాను ఊహించలేదని ఆయన స్పష్టం చేశారు. తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోదీ ఆరా తీశారన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు సహా ఈ ఘటనపై స్పందించిన ప్రతి ఒక్కరికీ పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలైన ఘటనపై పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. స్కూల్ పిల్లలు సమ్మర్ క్యాంప్‌నకు వెళ్లగా.. అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో తన కుమారుడికి గాయాలైనట్లు తెలిపారు. సమ్మర్‌క్యాంప్‌లో అగ్నిప్రమాదం జరిగి నా కుమారుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. సుమారు 30మంది చిన్నారులు సమ్మర్‌క్యాంప్‌లో ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. అగ్నిప్రమాదం చిన్నదే అనుకున్నా.. తర్వాత దాని తీవ్రత తెలిసింది. నా పెద్ద కుమారుడు అకీరా పుట్టిన రోజే.. రెండో కుమారుడికి ఇలా జరగడం బాధాకరం. రాత్రి 9.30గంటలకు సింగపూర్ బయల్దేరుతాను. పొగపీల్చడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం ఉండొచ్చని అన్నారు. ఈ ఘటన తెలుసుకొని అవసరమైన సహాయం చేసేందుకు చాలా మంది ముందుకొచ్చారు. ఈ సమయంలో నాకు అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలని తెలిపారు.

# మతపరమైన విభజనతో సమస్యలు పక్కదారి

(మొదటి పేజి తరువాయి)
పటేల్ సౌలభ్యం దృష్టి ఉంచుకుని సీడబ్ల్యూసీ సమావేశాలు ఆయన ఇంట్లోనే నిర్వహించేవారు. అలాంటి గొప్ప నాయకులపై భాజపా-ఆర్ఎస్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఖర్గే ఆరోపించారు. మరొక వైపు స్వల్ప జనాధిపత్యం దేశ వనరులను గుప్పిటలోకి తీసుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని నియంత్రించే పథంలో సాగుతోందని ఆయన పేర్కొన్నారు. సర్దార్ పటేల్‌ను ఖర్గే ఉటంకిస్తూ, సంస్థాగత బలం ప్రధానమైనదేనని, సంస్థ లేకుండా కేవలం సంఖ్యాబలం అర్థరహితం అని అన్నారు. గత అనేక సంవత్సరాలుగా జాతీయ హీరోలు పలువురి విషయమై పక్కా కుట్ర సాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'గడచిన 140 సంవత్సరాలుగా దేశానికి సేవ చేసిన, దేశం కోసం పోరాడిన మహోన్నత చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఒక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తమ విజయాలుగా చూపేందుకు ఏమీ లేనివారే ఈ పని చేస్తున్నారని ఖర్గే విమర్శించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌పై ఖర్గే విరుచుకుపడుతూ, స్వాతంత్ర్యోద్యమంలో తమ కృషిగా చూసేందుకు వారికి ఏమీ లేదని ఆయన అన్నారు. సర్దార్ పటేల్, పండిత్ నెహ్రూ మధ్య సంబంధాన్ని ఆ దిగ్గజాలకు ఒకరంటే ఒకరికి పడదనేలా చూపేందుకు అవి కుట్ర పన్నాయి. వారు ఒక నాణానికి రెండు వైపుల వారనేది వాస్తవం. వారి మధ్య సుహృద్భావపూర్వక సంబంధాలు ఉన్నాయనేందుకు దాఖలాలుగా



అనేక ఘటనలు, పత్రాలు ఉన్నాయని ఖర్గే స్పష్టం చేశారు. 'వారిద్దరి మధ్య దాదాపు రోజూ ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతుండేవి. నెహ్రూజీ అన్ని విషయాలపై ఆయన సలహా తీసుకుంటుండేవారు. పటేల్ సాహెబ్ అంటే నెహ్రూజీకి అపార గౌరవం ఉంది. బాబా సాహెబ్ అంబేద్కర్‌ను రాజ్యాంగ సభ సభ్యునిగా చేయడంలో మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ ముఖ్య పాత్ర పోషించారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు లేకపోతే రాజ్యాంగం రచన జరిగి ఉండేదే కాదని 1949 నవంబర్ 25న రాజ్యాంగ సభలో తన చివరి ప్రసంగంలో అంబేద్కర్ స్వయంగా చెప్పారని ఖర్గే గుర్తు చేశారు. 'రాజ్యాంగ రూపకల్పన జరిగినప్పుడు గాంధీజీని, పండిత్ నెహ్రూను, డాక్టర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్‌ను ఆర్ఎస్ఎస్ తీవ్రంగా విమర్శించిందని గుర్తు చేశారు. వారు రామ్‌లీలా మైదాన్‌లో రాజ్యాంగం, ఆ నేతల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. రాజ్యాంగానికి మనువాద లక్షాలు స్ఫూర్తి కాదని కూడా వారు అన్నారని ఖర్గే ఆరోపించారు. గాంధీ, బాబా సాహెబ్ విగ్రహాలను పార్లమెంట్ ప్రాంగణంలో నుంచి తొలగించి, ఒక మూలన పెట్టడం ద్వారా మోడీ ప్రభుత్వం వారిని అవమానించిందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను కాంగ్రెస్ గౌరవిస్తుంటుందని, దానిని ఎలా రక్షించాలో పార్టీకి తెలుసునని ఖర్గే స్పష్టం చేశారు. గాంధీతో సంబంధం ఉన్న సంస్థలను బిజెపి, సంఘ్ పరివార్ వ్యక్తులు స్వాధీనం చేసుకుని, వాటిని ఆయన సైద్ధాంతిక ప్రత్యర్థులకు అప్పగిస్తున్నట్లు కూడా ఖర్గే ఆరోపించారు. దేశంలో మతపరమైన విభజనలకు ప్రయత్నిస్తున్నారు. భారత్‌లోని ప్రాథమిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 140 ఏళ్లుగా దేశ సేవలో నిమగ్నమై ఉంది. స్వాతంత్ర్య సమరంలో ఎంతో పోరాడింది. అలాంటి పార్టీకి ప్రస్తుతం దేశంలో వ్యతిరేక పరిస్థితులను సృష్టిస్తున్నారు. మన పార్టీని అంతం చేయాలని చూస్తున్నారు. స్వతంత్ర దేశం కోసం ఏమీ సాధించని వారే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో సోనియా, రాహుల్, కెసి వేణుగోపాల్,దిగ్విజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

---------

## యూనివర్సిటీల్లో 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

(మొదటి పేజి తరువాయి)
పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంలో గత ప్రభుత్వం విఫలమైన తీరు రాష్ట్రం అభివృద్ధికి అడ్డు పడిందని చెప్పారు. ఈ మేరకు జరిగిన పొరపాట్లను గుర్తిస్తూ, సరిచేస్తూ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో గల ఖాళీలను నింపుతూ, నాణ్యతగల బోధనకు అవసరమైన మానవ వనరులను సమకూర్చే దిశగా ఈ చర్యలు ఎంతో కీలకమని వ్యాఖ్యానించారు. ఈ పోస్టుల భర్తీతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు కొత్త ఊపిరి లభించనుంది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందించేందుకు ఇది కీలక దశగా మారనుంది. ముఖ్యంగా పేద కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులకు ఇది ఒక రకం న్యాయం కూడా. విద్యారంగాన్ని బలోపేతం చేయడమే రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి మించిన దారి అంటూ, ముఖ్యమంత్రి పేర్కొంటూ ఈ పక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఈనెల 10 నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

(మొదటి పేజి తరువాయి)
ఇందులో భాగంగా, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి వేచిచూడాల్సిన అవసరం లేకుండా, కేవలం 10-15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నామని ప్రకటించారు. మొదటి దశగా రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 22 కార్యాలయాల్లో ఈ విధానం ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రానుంది. హైదరాబాదులో ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లాలో సదాశివపేట, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్, రంగారెడ్డి జిల్లాలో శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట వంటి ప్రాంతాల్లో ప్రారంభించ నున్నారు. ఒకేసారి ఎక్కువ దస్తావేజులు సమర్పించడం వల్ల జరిగే జాప్యాన్ని నివారించేందుకు ప్రతి కార్యాలయంలో పని వేళలను 48 స్లాట్లుగా విభజించారు. ప్రజలు స।గషసశషు.ష।శెగశశ.గు. వెబ్‌సైట్ ద్వారా అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని, నిర్ణీత సమయంలో హాజరై రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు. అత్యవసరంగా రాబోయే వారికి ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ఐదు వాక్-ఇన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంటు-ంది. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అధిక రద్దీ ఉన్న కార్యాలయాలకు అదనపు సబ్-రిజిస్ట్రార్లను నియమించనున్నట్లు- మంత్రి తెలిపారు. ఉదాహరణగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్-రిజిస్ట్రార్ల్ని నియమించబడ్డారు. తద్వారా అక్కడ 144 స్లాట్లు- అందుబాటు-లో ఉంటాయి. పని భారాన్ని సమతుల్యం చేయడం కోసం, అధిక రద్దీ ఉన్న మరియు తక్కువ రద్దీ ఉన్న కార్యాలయాల పరిధిని సమీక్షించి విలీనం చేస్తామని, మొదటగా చంపాపేట - సరూర్ నగర్ కార్యాలయాలను విలీనం చేస్తున్నట్లు- మంత్రి వివరించారు.

# కంచ భూముల్లో భూకుంభకోణం

(మొదటి పేజి తరువాయి)
సిఎం రేవంత్ రెడ్డి, బిజెపి మధ్య రహస్య బంధం ఉందని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డిని కాపాడుతుందే బిజెపి నాయకత్వం అని పేర్కొన్నారు. దేశంలో బిజెపి, కాంగ్రెస్ ఉమ్మడిగా బలపర్చిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. రెండు జాతీయ పార్టీల మద్దతుతో రేవంత్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ఆయన దేశంలో అత్యంత పవర్ ఫుల్ ముఖ్యమంత్రి అని చెప్పారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మంగళవారం నందినగర్‌లోని తన నివాసంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాజకీయ బాంబులు పేలకపోవటంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైలెంట్ అయ్యారని విమర్శించారు. అమృత్ టెండర్లలో అవినీతి జరిగిందని తాము కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా విచారణ చేపట్టలేదని అన్నారు. రేవంత్, రాహుల్ (ఆర్ఆర్) టాక్స్ అని స్వయంగా ప్రధాని మోదీ అన్నారని%ౌ% కానీ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో తాము పోటీకి దూరంగా ఉన్నామని చెప్పారు. హైదరాబాద్ పరిధిలో పోటీకి తమకు సరిపడా సభ్యులు లేని కారణంగానే పోటీ దూరంగా ఉన్నామని తెలిపారు. బిజెపి కోసం తామెందుకు పోటీకి దూరంగా ఉంటామని అన్నారు. ఎన్నికల్లో పోటీపై తమ విధానం తమకు ఉంటుందని స్పష్టం చేశారు. హెచ్‌సియు భూముల విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కు అంత ఉలికిపాటు ఎందుకు..? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచం అని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుకుంటే హెచ్‌సియు భూముల అమ్మకం ఆపలేదా..? అని నిలదీశారు. బహిరంగ సభకు అనుమతి ఇవ్వకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ తర్వాత బిఆర్ఎస్ పార్టీ మాత్రమే విజయవంతంగా 25 ఏళ్లు పూర్తిచేసుకుంటోందని కెటిఆర్ అన్నారు. తెలుగు రాష్ట్రాలలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న రెండో తెలుగు పార్టీ బిఆర్ఎస్ అని వ్యాఖ్యానించారు. హన్మకొండలోని ఎల్కతుర్తిలో 1200 ఎకరాల్లో బిఆర్ఎస్ ఆవిర్భావ సభ ఉంటుందని తెలిపారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభకు అనుమతివ్వాలని తమ పార్టీకి చెందిన వరంగల్ జిల్లా నాయకులు ఇప్పటికే ఎసిపిని కోరారని, ఇదే విషయంలో తాను డిజిపితో మాట్లాడానని చెప్పారు. బహిరంగ సభను పోలీసులు అనుమతి ఇవ్వకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వెల్లడించారు. తమ పార్టీ రజతోత్సవ సభ కోసం 3 వేల ఆర్‌టిసి బస్సులు కేటాయించాలని తమ పార్టీ నేతలు ఆర్‌టిసి ఎండి సజ్జనార్‌ను కోరినట్లు తెలిపారు. బిఆర్ఎస్ చరిత్రలో రజతోత్సవ సభ అతి పెద్దది అవుతుందని వ్యాఖ్యానించారు. ఏడాది పాటు కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ప్రతి నెలా వివిధ జిల్లాల్లో కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. జిల్లా పార్టీ కార్యాలయాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అన్నారు. మే నెలలో డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు చేపడతామని వెల్లడించారు. అక్టోబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుందని తెలిపారు. జూన్, జులైలో స్థానిక సంస్థల ఎన్నికలు రావచ్చని అంటున్నారని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొంటామని అన్నారు. మే నెల నుంచి అక్టోబర్ వరకు పార్టీ సభ్యత్వ నమోదు, కమిటీల నియామకంపై దృష్టి పెడతామని తెలిపారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు ప్రమాదకరం అని, వరంగల్ సభ ద్వారా ఇదే సందేశాన్ని కెసిఆర్ ప్రజలకు ఇవ్వబోతున్నారని తెలిపారు. హాస్టల్స్, గురుకులాల్లో సన్న బియ్యం ప్రవేశపెట్టిందే కెసిఆర్ అని చెప్పారు. సన్న బియ్యం కాన్సెప్ట్ కొత్తదేమీ కాదని, స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే.. కాంగ్రెస్‌కు ఉన్న ఆదరణ ఏంటో తెలుస్తుందని వ్యాఖ్యానించారు.

# పోలవరం ముంపుపై సంయుక్త సర్వే



హైదరాబాద్ ఏప్రిల్8(ప్రజావినికిడి,:పోలవరం ప్రా జెక్టు ముంపు ప్రభావంపై సంయుక్త సర్వే చేయాలని, ముంపు, బ్యాక్ వాటర్స్ ప్రభావంపై అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం పోలవ రం ప్రాజెక్టు అథారిటీని కోరింది. గత ఏడాది వ రదల ప్రభావంతో ముంపునకు గురైన నేపథ్యం లో అధ్యయనం సమగ్రంగా జరగాలని తెలంగా ణ ఈఎన్సీ అనిల్ కుమార్ కోరారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ హైదరాబాద్‌లోని సెంట్రల్ వాటర్ కమిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం భేటీ అయింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రాజెక్టు అథారిటీ ఛైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ అనిల్, ఏపీకి చెందిన ఇద్దరు చీఫ్ ఇంజినీర్లు భేటీలో పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, అంచనా వ్యయం, నిధులు వం టి తదితర అంశాలపై సమావేశంలో చర్చించిన ట్లు సమాచారం. కొత్తగా సర్వే అవసరం లేదని, గతంలో ఉన్న వివరాలు సరిపోతాయని ఏపీ చీఫ్ ఇంజినీర్లు వాదించగా సంయుక్త సర్వే చే యాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రాంతంలో ముంపును గుర్తిం చే అంశం, పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం ఉండే ప్రాంతాల్లోతీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న అభ్యంతరాలను తెలంగాణ అధికారులు మరోమారు ఈ భేటీలో లేవనెత్తారు. పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం గురించి సమావేశంలో తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు, ఇతర ప్రవాహాల చర్యల గురించి ప్రస్తావించారు. ఖమ్మం పట్టణం, భద్రాచలం పట్టణాలపై పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం, మణుగూరు భారజల ప్లాంట్ వద్ద వాటర్ లెవెల్స్ అంశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని రాష్ట్ర అధికారులు మరోసారి అథారిటీని కోరారు. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఆ ప్రభావం తెలంగాణపై ఏ మేరకు ఉంటుందనే విషయాలపై స్పష్టత రావాలని అథారిటీని తెలంగాణ అధికారులు కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ అనిల్ కుమార్, ఏపీ సీఈలు సుగుణాకర్, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చిన్న తప్పు చేసినా వీసా రద్దు!... అమెరికాలో భారతీయ విద్యార్థుల్లో ఆందోళన

హైదరాబాద్ఏప్రిల్8(ప్రజావినికిడి,:
అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని కలలు కంటున్న భారతీయ విద్యార్థులకు పరిస్థితులు అనుకూలంగా లేవు. ఒకప్పుడు ఎంతో ఆశావహంగా కనిపించిన అమెరికా కల, ఇప్పుడు ఆందోళనలు, భయాలతో నిండిన పీడకలగా మారుతోంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా వచ్చాక మారిన పరిస్థితులు, కొత్త విధానాలు, కఠినమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న జీవన వ్యయం, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం వంటి కారణాల వల్ల భారతీయ విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కొంతమంది విద్యార్థులు అతి వేగంగా వాహనం నడిపినందుకు లేదా సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టినందుకు వీసాలు రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు చిన్న పొరపాటు జరిగినా తమ భవిష్యత్తు అంధకారమవుతుందని ఆందోళన చెందుతున్నారు. “నేను ఎప్పుడూ భయంతో బతకాల్సి వస్తోంది. ఇక్కడ ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. మా భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది” అని ఓ విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక విద్యార్థి మాట్లాడుతూ, “మా స్నేహితుడు ఒక చిన్న ట్రాఫిక్ ఉల్లంఘన కారణంగా తన వీసాను కోల్పోయాడు. అతను వెంటనే భారతదేశానికి తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇది చాలా దారుణంగా ఉంది” అని చెప్పాడు. అమెరికాలోని కొన్ని కళాశాలలు అంతర్జాతీయ విద్యార్థుల వీసాల రద్దుకు సంబంధించిన సంఘటనలు పెరుగుతున్నాయని ధృవీకరించాయి. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని తెలిపాయి. దీనికి తోడు, అమెరికాలో చదువుకోవడం చాలా ఖరీదైన వ్యవహారం. ట్యూషన్ ఫీజులు, వసతి ఖర్చులు, ఆహార ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. దీని కారణంగా చాలామంది విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగాల విషయంలోనూ నిరాశ ఎదురవుతోంది. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం పొందడం అంత సులభం కాదు. వీసా నిబంధనలు కఠినంగా ఉండటం, కంపెనీలు విదేశీయులను నియమించడానికి వెనకాడటం వంటి కారణాల వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి. దీనివల్ల చాలామంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని కూడా స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తోంది. భారత కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యలను గుర్తించి, విద్యార్థులకు సహాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

# కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ



ప్రజావినికిడి, (మంచిర్యాల):ఏప్రిల్ 8 : జన్నారం యువ నాయకుడు ముడుగు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం వార సంత లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం గత ఆరు వారల నుండి కొనసాగుతుంది.వేసవి కాలం లో వార సంత కు వచ్చే వివిధ గ్రామలకు చెందిన ప్రజల దాహార్తి ని తీర్చేందుకు స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ముడుగు ప్రవీణ్ తెలిపారు.ఈ కార్యక్రమం లో పొనకల్ మాజీ ఎంపిటిసి రాగుల శంకర్,మాజీ వార్డు సభ్యులు బినవేణి గంగన్న యాదవ్,యూత్ నాయకులు ప్రశాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ) గ్రేటర్ హైదరాబాద్ సాయి నగర్ నూతన కమిటీ ఏర్పాటు..







**ప్రజావినికిడి,(నాగోల్):**
భారత జాతీయ మహిళా సమాక్య ఆధ్వర్యంలో సాయి నగర్ లోని ధర్మ బిక్షం భవన్ లో జరిగిన సభలో నూతన కమిటీ ఏర్పాటు ఈ సభకు సాహిదవేగం అధ్యక్షత వహించడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా మహిళా సమైక్య సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని,అలాగే గ్రేటర్ హైదరాబాద్ సిపిఐ పార్టీ కార్యదర్శి ఛాయాదేవి హాజరై ఆమెమాట్లాడుతూ,బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల పైన దాడులు పెరిగిపోయాయని నాగాలాండ్ లో జరిగిన ఘటన లు చాలా దుర్మార్గంగా సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునేలా ఉన్నాయని వారన్నారు. సమాజంలో సగ భాగమైన మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిత్యం దాడులకు గురవుతున్నారని అత్యాచారాలు అవమానాలు పెరిగిపోయాయని వారన్నారు.భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు అనేక సమస్యలపై పోరాటం చేసిందని ఎన్ని చట్టాలు వచ్చినా ఎన్ని ప్రభుత్వాలు మారినా మహిళల బ్రతుకులు మారలేదని అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.చందు భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి పైమీద గ్రేటర్ హైదరాబాద్ మహిళా సమైక్య అధ్యక్షురాలు నలిని మాట్లాడుతూ,నూతన కమిటీ బలోపేతానికి మా సహాయ సహకారాలు అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఆరు, గ్యారెంటీల అమలు కోసం పోరాటం చేయాలని మహిళలను చైతన్యవంతం చేసి పోరాటాలు వచ్చే విధంగా ఏ కమిటీ కృషి చేయాలని వారన్నారు. నూతన కమిటీ సహేదబేగం,ధనమ్మ , యన్ పద్మ, అచ్చాలి,కమిలి ప్రమీల,హేమలత అంజమ్మ బాలమని,పద్మ,నిర్మలమ్మ,పి.విజయలక్ష్మి, చిన్నమ్మ మణమ్మ, హేమలత,లక్ష్మి, లావణ్య షమీం,పల్లవి, అరుణ,సాయమ్మ, సరోజ తదితరులను ఎన్నుకోవవడం జరిగింది.

# రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం..



ప్రజావినికిడి,(రాజేంద్ర నగర్):



రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని శంషాబాద్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం విజయవంతంగా నిర్వహించబడింది. మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి.. ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కార్తిక్ రెడ్డి.. పాల్గొన్నారు.అలాగే ఇతర ముఖ్య నాయకులుముఖ్య ఆహ్వానం ఈ నెల 27వ తేదీన మన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో అందరూ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయండి.ఈ సభకు సంబంధించి గ్రామస్థాయిలో కమిటీలతో మీటింగ్లు ఏర్పాట్లు,లాజిస్టిక్స్, కార్యకర్తల సమీకరణ తదితర అంశాలపై సమావేశంలో సమగ్ర చర్చ జరిగింది.

# తెలంగాణలో 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు: అబ్కారీశాఖ..

ప్రజావినికిడి,(హైదరాబాద్):
తెలంగాణ అబ్కారీశాఖ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించింది. 331 రకాల కొత్త ఇండియన్ మేడ్ లిక్కర్ బ్రాండ్లకు, అలాగే 273 రకాల ఫారిన్ లిక్కర్ బ్రాండ్లకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది.47 కొత్త కంపెనీల నుంచి 386 రకాల కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొంది..



# తెరపైకి మళ్లీ మంచు ఫ్యామిలీ వివాదం..

ఏప్రిల్8ప్రజావినికిడి,:మంచు ఫ్యామిలీ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మోహన్ బాబు చిన్న కుమారుడు మంచు మనోజ్.. మళ్లీ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాడు. తన అన్న మంచు విష్ణుపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ఇంట్లో లేనప్పుడు కార్లతో పాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో తెలిపారు. జల్‌పల్లిలోని ఇంట్లో కూడా 150 మంది చొరబడి విధ్వంసం సృష్టించారని పేర్కొన్నాడు. తన తండ్రి మోహన్ బాబుతో మాట్లాడే ప్రయత్నం చేశానని.. కానీ ఆయన అందుబాటులోకి రాలేదని మనోజ్ చెప్పినట్లు తెలుస్తోంది.




కాగా, ఇటీవల ఉన్నట్టుండి మంచు ఫ్యామిలీలో గొడవలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. మంచు బ్రదర్స్.. ఇద్దరూ బౌన్సర్లతో ఒకరిపై ఒకరు గొడవకు దిగడం టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఈ క్రమంలోనే ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ గొడవకు సంబంధించిన కవరేజ్ కోసం వెళ్లిన ఓ రిపోర్టర్ పై మోహన్ బాబు చెయి చేసుకోవడంతో%ా% ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు మోహన్ బాబు సుప్రీం కోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది.

# సీఎం పట్టింపులకు పోవద్దు

## ..ఆ 400 ఎకరాలు వర్సిటీకే అప్పగించాలి.. ఆర్ కృష్ణయ్య

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**



హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూమిని సెంట్రల్ యూనివర్సిటీకే అప్పగించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వర్సిటీ భూముల్లోని చెట్లను నరికివేయడం తగదన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులపై నిర్బంధకాండ తగదని, పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పట్టింపులకు పోవద్దన్నారు.
ఎస్సీ,ఎస్టీ,బీసీలకు ఉన్నత విద్య అందిస్తున్న ఈ వర్సిటీని మరింతగా విస్తరించాలన్నారు. సమావేశం బీసీ సంఘాల నాయకులు నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్,మణికంఠ, ఆశీష్ గౌడ్,లింగం, రామ్,ఉమేష్ యాదవ్,రాహుల్, బాలస్వామి పాల్గొన్నారు.

# మమతా బెనర్జీకి సుప్రీంలో ఊరట

## టీచర్ పోస్టుల సిబిఐ విచారణ అవసరం లేదని వెల్లడి



న్యూఢిల్లీ,ఏప్రిల్8ప్రజావినికిడి,:: మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరటనిచ్చింది. ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో సీబీఐ దర్యాప్తు కోసం హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన కొన్నింటిని సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అదనపు టీచర్ పోస్టుల సృష్టి కోసం బెంగాల్ కేబినెట్ తీసుకున్న నిర్ణయంలో సీబీఐ దర్యాప్తు అవసరం లేదని పేర్కొంది. నిపుణుల కమిటీతో చర్చలు జరిపిన తర్వాత విద్యాశాఖ అదనపు పోస్టులను సృష్టించిందని.. ఇందుకు గవర్నర్ ఆమోదం లభించిందని పేర్కొంది. అప్పుడు ఇందులో న్యాయపరమైన జోక్యం అవసరం లేదని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. 25,753 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగుల నియామకానికి సంబంధించిన ఇతర అంశాలు, ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు- గ్రూప్ సీ, గ్రూప్ డీ స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. అయితే, 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికిపైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్ మెంట్ లెటర్లు సైతం అందించారు. ఖాళీల ఉన్న సంఖ్య కంటే ఎక్కువ మందిని నియమించడం పై వివాదం చెలరేగింది. ఉద్దేశపూర్వకంగానే అదనపు పోస్టులను సృష్టించి అక్రమంగా నియామకాలు చేపట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన కలకత్తా హైకోర్టు 2016 నాటి ఆ నియామక ప్రక్రియ చెల్లదంటూ తీర్పును వెలువరించింది. ఈ కేసులో అధికారుల పాత్ర, అవకతవకలపై దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశించింది. దీనిపై బెంగాల్ సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. సీబీఐ దర్యాప్తుపై స్టే విధించింది. అయితే, ఇప్పటికే 25,753 మంది టీ-చర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు ఇటీ-వల తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

# గ్యాస్ ధరలతో అదనపు భారం

## పెరుగుతున్న ధరలతో తీవ్ర ప్రభావం

హైదరాబాద్,ఏప్రిల్8ప్రజావినికిడి,: పెరిగిన పెట్రో,గ్యాస్ ధరలతో వాహనదారులు గొల్లుమంటున్నారు. తెల్లారేసరికి ఎంత పెరుగుతుందో అన్న ఆందోళనలో ఉన్నారు. ఇటీవల పెరిగిన ధరలతో ఒక్కో వాహనదారుడిపై కనీసం 300 వరకు అదనపు భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇవి కాక రవాణారంగంపై పెరుగుదల ప్రభావం పడుతోంది. దీంతో నిత్యావసర ధలరు విపరీతంగా పెరిగాయి. గతంలో మహా అయితే ఏడాదిలో రెండుసార్లు ఇంధనం ధరలు పెరిగేవి. ఇప్పుడేమో తెల్లవారితే ధరల్లో మార్పు కనిపిస్తోంది. అప్పట్లో ధరల పెరుగుదల తెలుసుకుని వినియోగదారులు ముందుగానే పెట్రోల్, డీజల్ పోయించుకునేవారు. ఇప్పుడు ముందు రోజు పెట్రోల్ పోయించుకున్న ధరకు, మరుసటి రోజుకు గమనిస్తే మనకు తెలియకుండానే పైసల్లో పెరుగుతోంది. ఈ పైసలే.. రోజుల వ్యవధిలో రూపాయిల్లోకి చేరుతున్నాయి. పెట్రోల్ నిత్యావసర సరుకులా మారింది. ఈ క్రమంలో పెరుగుతున్న ధరలు భారంగా మారుతున్నాయి. పరోక్ష భారం కూడా ఎక్కువే.పెట్రోల్, డీజల్ ధరలు రోజు వారీగా చూసినప్పుడు పెరుగుదల పైసల్లోనే కనిపిస్తోంది. ప్రత్యక్షంగా వినియోగదారుడిపై దాని ప్రభావం అంతగా కనిపించదు. కానీ, వాటి ధరల పెంపుతో రవాణా ఛార్జీలు, వస్తువుల తయారీపై భారం పడుతోంది. డీజల్ ధర పెరుగు దలతో వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ట్రాక్టరు, హార్వెస్టర్ అద్దె ధరలు పెరిగి పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ఇవన్నీ వాహనాల్లేని వినియోగదారులపైనా భారం పడుతున్నాయి. ఇకపోతే తాజాగా వంటగ్యాస్ సిలెండర్లు,పెట్రోల్, డీజిల్ పై వడ్డింపు మొదలైంది. ప్రభుత్వం సోమవారం ఎల్ పిజి ధరను రూ. 50 పెంచింది. ఉజ్వల వినియోగదారులతో పాటు, సాధారణ ప్రజలకూ కూడా గ్యాస్ సిలెండర్ ధర పెరుగుతుంది. అలాగే, పెట్రోలు, డీజిల్ పై ఎక్సైజ్ డ్యూటీని కేం ద్ర ప్రభుత్వం 2 రూపాయలు




పెంచింది. కొత్త ధరలు ఏప్రిల్ 8 నుంచే అమలులోకి వచ్చాయి. ఉజ్వల పథకం లబ్దిదారులకు ప్రస్తుతం రూ. 500 గా ఉన్న గ్యాస్ సిలిండర్‌కు ఇక రూ. 550 చెల్లించాలి. అలాగే సాధారణ వినియోగదారులకు ప్రస్తుతం 803 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్‌కు ఇక 853 రూపాయలు చెల్లించాలి. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ప్రస్తుతం గ్యాస్ సిలెండర్‌కు రూ. 855 రూపాయలు చెల్లిస్తున్న వినియోగదారులు ఇక రూ. 905 చెల్లించవలసి ఉంటుంది. చమురు మార్కెటింగ్ కంపెనీలు ఏటా 43 వేల కోట్ల రూపాయలు నష్టపోతున్న కారణంగానే ఎల్ పిజీ ధరలు పెంచవలసి వచ్చినట్లు కేంద్రమంత్రి హర్దీప్ పురి వివరించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంచడం వల్ల రీటైల్ ధరల పై ఎలాంటి ప్రభావం పడదని రెవిన్యూ విభాగం నోటిఫికేషన్ లో పేర్కొంది.

# విచారణకు సహకరించండి

## మన్నె క్రిశాంక్‌కు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్,ఏప్రిల్8ప్రజావినికిడి,:కంచె గచ్చిబౌలి భూముల విషయంలో నకిలీ వీడియోల ప్రసారంపై విచారణకు సహకరించాలని భారాస నేత మన్నె క్రిశాంక్ ను హైకోర్టు ఆదేశించింది. ఆయన పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల ఘటనలో నకిలీ వీడియోలు వైరల్
చేశారని పోలీసుల ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని క్రిశాంక్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. విచారణకు సహకరించాలని ఆయనను ఆదేశించింది. కొణతం దిలీప్‌నకు నోటీ-సులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించి.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఒకే ఘటనపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వెల్లడించారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసులు పెట్టారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కంచ గచ్చిబౌలి భూముల ఘటనపై ఆబ వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేసి వైరల్ చేశారని.. సీఎంపై అనుచిత పోస్టులు పెట్టారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.

# దేశంలో ఎస్సీ,ఎస్టీ,బిసిల పట్ల వివక్ష

## పూలే విగ్రహ ఏర్పాటులై 11లోగా ప్రకటన చేయాలి -ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ కవిత డిమాండ్





హైదరాబాద్ఏప్రిల్8ప్రజావినికిడి,: దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల పట్ల జరుగుతున్న వివక్షను అడ్డుకోవాల్సి ఉందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీసీల హక్కుల కోసం ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన దీక్షలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇది ప్రజాస్వామ్య దేశమా? అనే ప్రశ్నలను ఆమె సంధించారు. శ్రీరామనవమి సందర్భంగా రాజస్థాన్ లో కాంగ్రెస్ ఎమ్మెల్యే టికారాం జుల్లి రామాలయాన్ని దర్శించుకెళ్తే, ఆలయం మైలపడిందని అభిప్రాయపడుతూ సంప్రోక్షణ చేపట్టిన దళిత వ్యతిరేక వర్గాల చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దౌర్భాగ్యమైన ఘటనలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్నాయంటే, ప్రజాస్వామ్యం, సమానత్వం, సోదరభావం అన్నది కేవలం మాటలకే పరిమితమవుతోందని ఆమె వ్యాఖ్యానించారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవానికి దేశపు గౌరవనీయ రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రపతి గిరిజన మహిళ అయితే ఏమి? ఆమెను ఆహ్వానించకపోవడం బీజేపీ ప్రభుత్వం ఎస్టీ సామాజిక వర్గం పట్ల తీసుకున్న దారుణ వైఖరని పేర్కొన్నారు. బీసీలకు కూడా ఈ దేశంలో ఇప్పటికీ అనేక అవమానాలు జరుగుతున్నాయని ఆమె అన్నారు. ధర్నాలు ఎందుకు చేస్తున్నాం? అని కొంతమంది అడుగుతున్నారని, బీసీ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నా ఆవేశం, ఆవేదన ఇవి. రాజకీయ అవసరం కాదు, ఇది హక్కుల పోరాటం అని స్పష్టం చేశారు. ఈబ్ల్యూఎస్ అమలుతో 50శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తేసిన నేపథ్యంలో, కోర్టులు రిజర్వేషన్‌ను అడ్డుకునే అవకాశమే లేదని ఆమె అభిప్రాయపడ్డారు. బీసీలకు అర్హతకు తగ్గ రిజర్వేషన్లు ఇవ్వాలంటే ఇది సరైన సమయమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఆవరనలో పూలే విగ్రహం పెట్టాలని తాము కోరుతున్నామని, ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని అన్నారు. ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని, అనుముల ఇంటెలిజెన్స్ అని, ఇది రాష్ట్రానికి ప్రమాదమని కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటుకై కవిత మంగళవారం ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాస్తవానికి అనుముల ఇంటెలిజెన్స్‌తోనే రాష్ట్రానికి ప్రమాదమని వ్యాఖ్యానించారు. ఇది రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోందని కవిత అన్నారు. ఇది పక్కకు జరిగితే తప్ప రాష్ట్రం బాగుపడే పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు. ప్రజలను మోసం చేయడమే అనుముల పని అని విమర్శించారు. అనుముల ఇంటెలిజెన్స్‌ను వాడి కులగణనను తప్పుదోవ పట్టించారని, బీసీకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. సర్వే వివరాలను అసెంబ్లీలో పెట్టకుండా అధ్యయనం చేసిన తర్వాత రిజర్వేషన్ ఇస్తారట అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ ధైర్యం ఎందుకు లేదని కవిత ప్రశ్నించారు. 2011లో యూపీఏ హయాంలో దేశంలో కులగణన చేసినా ఇప్పటికీ ఆ వివరాలు వెల్లడించలేదని అన్నారు. ఆ వివరాలను వెల్లడించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని, అందుకు తాము కూడా కలిసి వస్తామని చెప్పారు. అదేవిధంగా కాంగ్రెస్ నేతలలాగా తాము ఢిల్లీలో దొంగ దీక్షలు చేయబోమని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధికంగా దీక్షకు కూర్చుంటామని అన్నారు. చట్టసభలు బిల్లులను ఆమోదించి నాలుగు వారాలైందని, ప్రస్తుతం ఆ బిల్లుల స్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఆ బిల్లులు గవర్నర్ వద్దనే పెండింగ్‌లో ఉన్నాయా.. లేదంటే రాష్ట్రపతికి పంపించారా..? అని నిలదీశారు. బిల్లుల ఆమోదం తర్వాత అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తామని సీఎం అన్నారని, కానీ ఇప్పటివరకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లలేదని అరోపించారు. బీజేపీతో రేవంత్‌రెడ్డికి లాలూచీ ఉన్నదని, బీజేపీని కాపాడటం కోసమే కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లడం లేదని ఆరోపణలు చేశారు.అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడానికి బదులు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో తుఫేల్ ధర్నా చేశారని, ఆ ధర్నాకు రాహుల్ గాంధీ వస్తారని ఊదరగొట్టారని, కానీ చివరికి ఆయన రాలేదని కవిత చెప్పారు. ఢిల్లీలో కూడా ముఖ్యమంత్రి తెలుగులో మాట్లాడారని, ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తేవాలంటే వాళ్లకు అర్థమయ్యే భాషలో చెప్పాలని అన్నారు. రేవంత్ సర్కారుకు చిత్తశద్ధి ఉంటే కులగణన నివేదికను అసెంబ్లీలో పెట్టాలని,ఏప్రిల్ 11లోగా పూలే విగ్రహం ఏర్పాటు-పై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

---

# కెటిఆర్ అరెస్ట్ కాకుండా రేవంత్ అడ్డుపుల్ల

## కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపణ



హైదరాబాదఏప్రిల్8ప్రజావినికిడి,: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జైలుకు వెళ్లకుండా సీఎం రేవంత్‌రెడ్డే కాపాడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఇంతకాలం అయినా కేసులు పెట్టి ఎందుకు విచారించడం లేదో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు.కేటీఆర్, రేవంత్ ఏకమై భాజపాను దెబ్బతీసేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పై చెన్నైలో జరిగిన సమావేశానికి కేటీఆర్, రేవంత్ రెడ్డి కలిసే వెళ్లారు. హైదరాబాద్‌లో త్వరలో జరగబోయే సమావేశానికీ ఇద్దరూ కలిసే ప్లాన్ చేస్తున్నారు. ఆ ఇద్దరూ కలిసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, భారాస ఎంపీలతో ఓటు వేయించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇద్దరూ కలిసే మజ్లిస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధమయ్యారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రేవంత్‌ను కాపాడేందుకే కేటీఆర్ భారాస అభ్యర్థిని బరిలోకి దించలేదు. తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ బుద్ధి మారలేదు. హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా? భూదందా, అవినీతిపరులపై ఉక్కుపాదం మోపే మోదీ సర్కార్ కేంద్రంలో ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు.

-----

# భూ కబ్జాలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

## బిఆర్ఎస్‌కు కడియం శ్రీహరి సవాల్



జనగామ,ఏప్రిల్8ప్రజావినికిడి,: భూ కబ్జాలు నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిఆర్ఎస్‌కు కడియం శ్రీహరి సవాల్ విసిరారు. తనపై వచ్చిన భూకబ్జా ఆరోపణలను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తిప్పికొట్టారు. బిఆర్ఎస్ నేతలు చేస్తున్న కుట్రలుగా అభివర్ణించారు. భూ కబ్జాలను నిరూపించాలని సవాల్ చేశారు. దేవునూరు గుట్టలను ఆక్రమిస్తున్నారంటూ భారాస నేతలు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. దీనిపై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు. 2వేల ఎకరాలు కబ్జా చేశానంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తున్నారు. బినామీలకు భూములు అప్పగించేందుకు యత్నిస్తున్నానంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది. నేను కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్య ఇంట్లో గులాంగా పనిచేస్తా. ఆరోపణలు నిరూపించలేకపోతే వారు నాకు గులాంగా ఉంటారా? తప్పుడు ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటా అని కడియం శ్రీహరి అన్నారు. తన విమర్శలను తట్టుకోలేక ఎదురుదాడి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరేమిటో ప్రజలకు బాగా తెలుసుని అన్నారు.

# ఆర్టీసీ బస్సు బోల్తా: ఐదుగురికి గాయాలు



హనుమకొండఏప్రిల్8ప్రజావినికిడి,:హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టు రింగురోడ్డు వద్ద ఓ ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా, మరో 15 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. బస్సు ఒంగోలు నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

# మహావీర్ జయంతి

## 10న మాంసం దుకాణాల బంద్



హైదరాబాద్,ఏప్రిల్8ప్రజావినికిడి,: మహావీర్ జయంతి సందర్భంగా ఈ నెల 10న గ్రేటర్‌లోని మాంసం విక్రయాలు జరుపకుండా, దుకాణాలు మూసి వేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పేర్కొంది. ఈమేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిది ఆదేశాలు జారీ చేశారు. మటన్, బీఫ్ తదితర మాంసం విక్రయ దుకాణాలు, కబేళాలు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రై పోలీస్ కమిషనర్లకూ సమాచారం అందించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అచ్చంపేట ఎస్‌బిఐలో భారీ అవినీతి

## రైతుల ఖాతాల నుంచి కోటిన్నర కాజేసిన ఉద్యోగి

## పోలీసులకు ఫిర్యాదుతో ఉద్యోగి సస్పెన్షన్

**అచ్చంపేట,**ఏప్రిల్8ప్రజావినికిడి,: నాగర్ కర్నూల్ జిల్లాలో ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ చేతివాటం వెలుగుచూసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం కేంద్రంలోని ఎస్ బిఐ ఉద్యోగి బాగోతం వెలుగులోకి వచ్చింది. 45 మంది రైతుల ఖాతాల నుంచి కోటిన్నర రూపాయలను బ్యాంకు ఉద్యోగి కిరణ్ తన ఖాతాకు మళ్లించాడు. దీంతో రైతులు తమ ఖాతాల నుంచి డబ్బులు మాయం కావడంతో బ్యాంకు మేనేజర్ కు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బ్యాంకు ఉన్నతాధికారుల కిరణ్‌ను సస్పెండ్ చేశారు. రైతుల నిలదీతతో డబ్బులు తిరిగి జమ చేస్తామని బ్యాంకు మేనేజర్ హామీ ఇచ్చాడు. చేతివాటం ప్రదర్శించి కోట్లు కొల్లగొట్టిన ఎస్బీఐ బ్యాంకు ఉద్యోగి కిరణ్, బ్యాంకు ఖాతాదారులైన 45 మంది రైతుల సొమ్ము కోటిన్నర తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. తమ ఖాతాల్లోని డబ్బు మాయం అవడంపై రైతులు బ్యాంకు మేనేజర్ ను నిలదీశారు. ఏవో కారణాలు చెప్తూ.. నేడు, రేపు అంటూ తప్పును కప్పిపుచ్చేందుకు బ్యాంకు మేనేజర్ ప్రయత్నం చేశాడు. రైతులు నిలదీయడంతో త్వరలోనే డబ్బులు ఖాతాలో జమ చేస్తానని బ్యాంకు మేనేజర్ హామీ ఇచ్చాడు. రోజులు గడుస్తుండడంతో ఆందోళనకు గురైన ఖాతాదారులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు. రైతుల సొమ్ము కోటిన్నర తన ఖాతాలోకి మళ్లించుకున్న ఉద్యోగి కిరణ్ ను అధికారులు సస్పెండ్ చేశారు.

-------

# మియాపూర్‌లో లారీ బీభత్సం

## పోలీసులపైకి దూసుకొచ్చిన లారీ ప్రమాదంలో హోంగార్డు మృతి



హైదరాబాద్,ఏప్రిల్8ప్రజావినికిడి,:: మియాపూర్ (ఃఈాశూషస) మెట్రో స్టేషన్ వద్ద లారీ బీభత్సం సృష్టించింది. విధుల్లో ఉన్న ముగ్గురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లపైకి లారీ దూసుకెళ్లింది. దీంతో ఒకరు మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు సింహాచలం, రాజవర్ధన్, విజేందర్ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మెట్రో స్టేషన్ పిల్లర్ నంబర్ 600 వద్ద విధులు నిర్వహిస్తున్నారు. నో ఎంట్రీ వాహనాలను నియంత్రిస్తున్నారు. అదే సమయంలో కూకట్‌పల్లి భరత్ నగర్‌లో బియ్యం బస్తాలను అన్‌లోడ్ చేసిన ఓ లారీ.. మియాపూర్ వైపు అతివేగంగా వచ్చి ట్రాఫిక్ బూత్‌ను ఢీకొట్టింది. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై పడింది. దీంతో హోంగార్డు మృతి చెందాడు. లారీ దూసుకు రావడంతో ట్రాఫిక్ విధుల్లో ఉన్న రాజవర్ధన్, వికేందర్, సింహాచలం తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సింహాచలం మృతి చెందాడు. మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టోల్ చెల్లించమన్నందుకు దాడి

రంగారెడ్డి,ఏప్రిల్8ప్రజావినికిడి,:: టోల్ చెల్లించమన్నదుకు ఉద్యోగిపై దాడి చేశారు. టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై ఓ వాహనదారుడు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం జరిగింది. టోల్ ఛార్జీ చెల్లించాలని కోరిన తనపై.. వాహనదారుడు దాడికి పాల్పడినట్టు టోల్ ఉద్యోగి తెలిపారు. వాహనదారుడు తనను కాలర్ పట్టుకుని లాక్కెళ్లినట్టు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దాడి ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాహనదారుడిని రాజేంద్రనగర్ కిస్మత్‌పూర్‌కు చెందిన సంతోష్ గౌడ్‌గా పోలీసులు గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు ప్రస్తుతం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# తెలంగాణలో రాగల మూడురోజుల పాటు వర్షాలు

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక



హైదరాబాద్,ఏప్రిల్8ప్రజావినికిడి,:తెలంగాణలో రాగల మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయువ్య దిశగా కదిలి.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఉందని తెలిపింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం మధ్య ట్రోపోఆవరణం వరకు విస్తరించి ఉందని, ఈ అల్పపీడనం వచ్చే 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉత్తర వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని చెప్పింది. తర్వాత దిశను మార్చుకొని ఉత్తర-ఈశాన్య దిశగా తిరిగి.. రాగల 24గంటల్లో మధ్య బంగాళాఖాతంలో క్రమంగా బలహీనంగా పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఈ క్రమంలో మంగళవారం ములుగు, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. బుధవారం భూపాపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వానలు పడుతాయని చెప్పింది. 11న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేటతో పాటు- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని తెలిపింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# రాష్ట్రంలో బీహార్ తరహా పరిస్థితులు

## పూర్తిగా దిగజారిన శాంతిభద్రతలు రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. రాప్తాడులోలింగమ్మ కుటుంబానికి జగన్ పరామర్శ

అనంపతురం,ఏప్రిల్8ప్రజావినికిడి,: రాష్ట్రంలో బీహార్ తరహా పరిస్థితులు కనిపిస్తున్నాయని వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంచనల ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, శాంతిభద్రతలు దిగజారాయి.. మొత్తం రెడ్‌బుక్ పరిపాలన నడుస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు ఎంత భయపెట్టినా.. ప్రలోభాలు పెట్టినా ఎంపీపీ ఎన్నికల్లో వైసీపీ గెలిచింది.. అయితే, వైసీపీ గెలిచినచోట్ల చంద్రబాబు హింసను ప్రోత్సహిస్తున్నా రని ఆరోపించారు.రాప్తాడు నియోజకవర్గం పాపిరెడ్డిపల్లికి వెళ్లిన మాజీ సీఎం వైఎస్ జగన్.. ఇటీవల హత్యకు గురైన వైసీపీ నేత కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించారు.. అసలు ఏం జరిగింది.. ఎంత మంది వచ్చారు.. ఎవరెవరిపై దాడి చేశారు.. లాంటి విషయాలపై ఆరా తీశారు.. లింగమయ్య కుటుంబాన్ని ఓదార్చారు.. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని లింగమయ్య కుటుంబానికి భరోసా ఇచ్చారు.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సర్కార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అడుగడుగునా దౌర్జన్యాలకు పాల్పడ్డారు.. రాప్తాడులో జరిగిన ఘటన బాధాకరం అన్నారు. రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలని సూచించారు.. అయితే, చంద్రబాబు ఎంత భయపెట్టినా, ప్రలోభాలు పెట్టినా ఎంపీపీ ఎన్నికల్లో వైసీపీ



గెలిచిందని తెలిపారు.. ఏపీలో ఎక్కడా శాంతి భద్రతలు లేవు.. ఎన్నికలు జరిగిన 57 స్థానాల్లో టీడీపీకి బలం లేదు.. అయితే, చంద్రబాబు ఎన్ని ప్రలోభాలు పెట్టినా 39 స్థానాల్లో వైసీపీ గెలుపొందిందన్నారు.. టీడీపీకి అనుకూలంగా లేదని 7 చోట్ల ఎన్నికలు వాయిదా వేయించారని ఫైర్ అయ్యారు.. రామగిరిలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలిచింది.. అయినా.. టీడీపీ నేతలు ఎంపీపీ కోసం ప్రయత్నించి విఫలం అయ్యారన్నారు.. ఈ ఘటన తర్వాత 20 మంది దాడి చేసి లింగమయ్యను హత్య చేశారని ఆవేదన వెలిబుచ్చారు.. లింగమయ్య హత్య కేసులో కేవలం ఇద్దరిపైనే కేసులు పెట్టారు.. మరి, ఎస్ఐ సుధాకర్‌పై ఎందుకు చర్యలు తీసుకోరని నిలదీశారు.. లింగమయ్య భార్యతో బలవంతంగా వేలిముద్ర తీసుకుని కేసును బిల్డప్ చేశారు.. అసలు నిందితుల్ని వదిలేసి తూతూ మంత్రంగా ఇద్దరిపై కేసులు నమోదు చేశారని మండిపడ్డారు వైఎస్ జగన్.. పోలీసులే ఇష్టం వచ్చిన స్టేట్‌మొత్తం రాసుకొని.. చదువురాని లింగమయ్య భార్యతో వేలిముద్ర తీసుకున్నారని విమర్శించారు.. బేస్ బాల్ బ్యాట్‌తో కొట్టి చంపారు.. ఈ విషయాన్ని పోలీసులు ఎక్కడా ప్రస్తావించలేదు.. చిన్న కర్రలతో కొట్టారని.. కేసును తప్పుదారి పట్టించేలా రాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. సాక్షులను కూడా నిందితులకు సంబంధించిన వారిని తీసుకోవడం దారుణమైన విషయం అన్నారు.





# వలంటీర్లను మోసం చేసిన జగన్ ప్రభుత్వం

అరకు ఏప్రిల్ 08జర్నలిస్ట్ జర్నీ న్యూస్: సరైన ఉత్తర్వు పత్రాలను, జీతభత్యాలను లేకుండానే వారిని గత ప్రభుత్వం నియమించింది. గౌరవ వేతనాలు విచిత్రంగా ఎక్కడ నుంచి అందించిందో కూడా తెలియని పరిస్థితి కనిపించింది. నేను ఈ విషయంపై చర్చకు తీసుకురాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పరిశీలన చేసి వాలంటీర్లకు సంబంధించి ఎలాంటి అధికారిక నియామకాలు జరగలేదని గుర్తించారు. వాలంటీర్ల ఉద్యోగాల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం వారిని నిలువునా వంచించిందని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వాలంటీర్లను సేవ చేయడానికి తీసుకొని గౌరవ వేతనాల పేరుతో అనధికారిక చెల్లింపులు జరిపినట్లు-తెలుస్తోందన్నారు. పేరుకు ప్రభుత్వ ఉద్యోగాలు అని నమ్మించి, పూర్తిగా వారు ఏ కోవలోకి చెందకుండా పని చేయించుకున్నారని స్పష్టం చేశారు. అసలు జీతాలు ఎక్కడ నుంచి వచ్చాయో వాలంటీర్లు అంతా సంఘ నాయకులను ప్రశ్నించాలని, విచిత్రమైన అకౌంటింగ్ తో యువతను నిలువునా మోసం చేసిన ఘనత గత ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. యువత జీవితాలు బాగుండాలని కలలు కనే వ్యక్తినని, వాలంటీ-ర్లను ఆదుకునే విషయంలో సరైన దారి వెతుకుతామని శ్రీ పవన్ కళ్యాణ్ గారు హామీ ఇచ్చారు. అల్లూరి సీతా రామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం కురుడి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు చెప్పిన సమస్యలు అసాంతం విన్నారు. వాటిని రాసుకున్నారు. అనంతరం సమస్యలపై అధికారులకు తగు సూచనలు చేసి పరిష్కార మార్గాలు వెతకాలని చెప్పారు. ఈ సందర్భంగా కొందరు యువత వాలంటీర్ల సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకొచ్చారు. ఇకపోతే తన పర్యటనలో గిరిజనులు గంజాయి సాగు జోలికి వెళ్లొద్దని అన్నారు. గంజాయి కంటే తులసి, మారేడు మొక్కలు నాటడం మంచిది. మేము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. మీకు సమస్యలు ఉంటే వాటిని తీర్చడానికి మేము పని చేస్తాం. తప్పు జరిగినప్పుడు మాట పడటానికి కూడా సిద్ధంగానే ఉన్నాం. నాకు మొదట నుంచి ప్రకృతి అంటే ప్రేమ, అడవి అంటే అభిమానం. నేను గిరిజనుడుగా పుట్టలేదు కానీ నాలో గిరిజన మనస్తత్వం ఉంది. అడవి బిడ్డల ఆక్రందన, వేదన నా మనసుకు ఎప్పుడు తాకుతూనే ఉంటాయి. వారి కష్టం నా కష్టం అనుకుంటాను. అడవి బిడ్డల ప్రేమ, అభిమానం నా మనసుకు ఎప్పుడూ తాకుతూనే ఉంటుంది' అన్నారు. ఎకో టూరిజం అభివృద్ధిలో అరకు మండలం, సుంకరమెట్ట కాఫీ ఎస్టేట్స్ లో ఏర్పాటు చేసిన చక్క వంతెనను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు రూ.19 లక్షల అంచనా వ్యయంతో కాఫీ తోటల మధ్య నిర్మించిన చెక్క వంతెనను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. చెక్క వంతెన ప్రారంభానికి ముందు ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ ఆర్.వి. సుజయ కృష్ణ రంగారావుతో కలసి కాఫీ తోటల్లో మొక్కలు నాటారు. అనంతరం కాఫీ తోటల మధ్య ఆ వంతెనపై కెనోపీ వాక్ ప్రారంభించారు. ఉడెన్ బ్రిడ్జ్ పై నడుస్తూ ఆద్యంతం కాఫీ తోటల వివరాలను అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిల్వర్ ఓక్ చెట్ల మధ్య వేసిన కాఫీ మొక్కలు, ఎత్తయిన మొక్కలపైకి పాకిన మిరియాల పంటల సాగుపై ఆరా తీశారు. వంతెనపై ఏర్పాటు చేసిన ట్రీ-డెక్స్, పక్షి గూడు ఆకారంలో ఏర్పాటు- చేసిన బర్డ్ నెస్ట్ లను ఆసక్తిగా తిలకిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు- చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫోటో గ్యాలరీని తిలకించారు. ఎకో టూరిజం అభివృద్ధికి అటవీశాఖ అధికారులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. కాఫీ తోటల అభివృద్ధి, ఎకో టూరిజం అభివృద్ధికి సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. ఇలాంటి ప్రాజెక్టులు మరిన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అరకు డిలైట్ కాఫీ బ్రాండ్ ప్రోమోషన్ తో పాటు- సుంకరమెట్ట ఎకో టూరిజం పోస్టర్లు, బ్రోచర్లను పవన్ కళ్యాణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ కజూరియా, విశాఖ రీజన్ ఫారెస్ట్ చీఫ్ కర్జర్వేటర్ డాక్టర్ జ్యోతి తుల్లిమెల్లి, జిల్లా కలెక్టర్ శ్రీ దినేష్ కుమార్, గ్రామ సర్పంచ్ గెమ్మిలి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం ఇంత తీవ్రంగా ఉందనుకోలేదు

## అకీరా బర్త్‌డే రోజే ఇలా జరగడం విచారకరం

## కుమారుడికి గాయాలపై పవన్ వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్8ప్రజావినికిడి,: : సింగపూర్‌లోని స్కూల్‌లో అగ్ని ప్రమాదం కారణంగా కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌కు గాయాలు కావడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తొలిసారి స్పందంచారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అరకు పర్యటనలో ఉండగా తనకు ఫోన్ వచ్చిందని తెలిపారు. తన కుమారుడు మార్క్ శంకర్



స్కూల్‌లో అగ్నిప్రమాదం జరిగిందని తెలిపారన్నారు.ఈ ప్రమాదంలో మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు గాయాలయ్యాయని వివరించారు. అయితే ప్రమాదం తీవ్రత ఇంతలా ఉంటుందని తాను ఊహించలేదని ఆయన స్పష్టం చేశారు. తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోదీ ఆరా తీశారన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు సహా ఈ ఘటనపై స్పందించిన ప్రతి ఒక్కరికీ పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలైన ఘటనపై పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. స్కూల్ పిల్లలు సమ్మర్ క్యాంప్‌నకు వెళ్లగా.. అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో తన కుమారుడికి గాయాలైనట్లు తెలిపారు. సమ్మర్‌క్యాంప్‌లో అగ్నిప్రమాదం జరిగి నా కుమారుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. సుమారు 30మంది చిన్నారులు సమ్మర్‌క్యాంప్‌లో ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. అగ్నిప్రమాదం చిన్నదే అనుకున్నా.. తర్వాత దాని తీవ్రత తెలిసింది. నా పెద్ద కుమారుడు అకీరా పుట్టిన రోజే.. రెండో కుమారుడికి ఇలా జరగడం బాధాకరం. రాత్రి 9.30గంటలకు సింగపూర్ బయల్దేరుతాను. పొగపీల్చడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం ఉండొచ్చని అన్నారు. ఈ ఘటన తెలుసుకొని అవసరమైన సహాయం చేసేందుకు చాలా మంది ముందుకొచ్చారు. ఈ సమయంలో నాకు అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలని తెలిపారు.

# అమరావతిలో చంద్రబాబు ఇంటి నిర్మాణం

## వెలగపూడిలో నేడు భూమి పూజ

అమరావతి,ఏప్రిల్8ప్రజావినికిడి,: రాష్ట్ర రాజధాని అమరావతిలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇంటి నిర్మాణం శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు అయింది. బుధవారం ఉదయం శంకుస్థాపనలో భాగంగా భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొనున్నారు. వెలగపూడి సచివాలయం వెనుక ఈ9 రహదారి పక్కనే ఈ ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు.తన ఇంటి నిర్మాణం ద్వారా రాజధాని అమరావతికి ఒక భరోసా, నమ్మకంగా ఉండాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. అందులోభాగంగా ఇటీవల అమరావతిలో ఐదు ఎకరాల స్థలాన్ని సీఎం చంద్రబాబు నాయుడు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు భూమి పూజ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబానికి పట్టు- వస్త్రాలు సమర్పించాలని గ్రామస్తులు నిర్ణయించారు. రాజధాని ఉద్యమ సమయంలో తమకు నారా భువనేశ్వరి ధైర్యం చెప్పారని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. అలాగే అదే సమయంలో ఆమె తన గాజులను దానంగా అందజేశారని రైతులు వివరించారు. ఆ కుటు-ంబానికి తమ గ్రామం ఎంత ఇచ్చినా తక్కువేనని.. ఉడతా భక్తి కింద ఆ దంపతులకు పట్టు- వస్త్రాలు సమర్పిస్తామని వారు పేర్కొన్నారు. 2500 గజాల్లో రాజధాని ఇంటి నిర్మాణాన్ని



సీఎం చంద్రబాబు చేపట్టనున్న సంగతి తెలిసిందే. కార్యాలయం, నివాసంలోపాటు కారు పార్కింగ్ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని సీఎం చంద్రబాబు ఈ ఇంటి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇంకోవైపు.. ఈ నిర్మాణ స్థలాన్ని ఇటీ-వల నారా భువనేశ్వరి సైతం పరిశీలించిన విషయం విదితమే. గతంలో 2019 ఎన్నికలకు ముందు రాజధాని అమరావతికి మద్దతుగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ తాడేపల్లిలో ఇంటిని సైతం నిర్మించుకున్నారని ఆ పార్టీ నేతలు ఆర్కే రోజు, పేర్ని నాని తదితరులు ప్రకటించారు. రాజధాని అమరావతికి మద్దతుగా ఆయన ఈ నిర్మాణాన్ని చేపట్టారని వివరించారు. అలా ఆ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను ఆ పార్టీ గెలిచుకొంది. దీంతో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ కొద్ది రోజులకే రాష్ట్రానికి మూడు రాజధానులంటూ వైఎస్ జగన్ కీలక ప్రకటన చేశారు. దీంతో రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులు ఉద్యమం చేపట్టారు. ఆ ఉద్యమం వందల రోజుల పాటు-కొనసాగింది. ఇక 2024లో ఎన్నికల్లో జరిగాయి. ఈ ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు మొత్తం 164 స్థానాలకు -కై-వసం చేసుకున్నాయి. అనంతరం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఆ తర్వాత రాజధాని అమరావతి పనులు ఊపందుకున్నా సంగతి తెలిసిందే.

# ప్రజలకు చేరువగా మనమిత్ర

## అందరి ఫోన్‌లలో ఇక వాట్సాప్ సేవలు

అమరావతి,ఏప్రిల్8ప్రజావినికిడి,:: ాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటింటికీ 'మనమిత్ర' కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లా కలెక్టర్‌కు కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. వాట్సప్ గవర్నెన్స్‌పై సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. ప్రతి పౌరుడి ఫోన్‌లో 95523-00009 నంబర్‌ను సచివాలయ సిబ్బంది సేవ్ చేయనున్నారు. ప్రజలకు అవగాహన పెంచేలా ప్రత్యేక కరపత్రం, వీడియో సందేశాన్ని విడుదల చేసింది. తద్వారా ప్రతి ఒక్కరూ వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించుకునేలా ఐటీ-, రియల్ టైం గవర్నెన్స్ శాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది.ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 250కి పైగా సేవలందిస్తోంది. జూన్ నెలకు 500కు పైగా సేవలందించే దిశగా చర్యలు చేపట్టింది. తదుపరి దశలో 1000కిపైగా సేవల కల్పించాలన్నది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా అధికారులు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా వాట్సప్ గవర్నెన్స్‌ను ఐటీ- శాఖ మంత్రి నారా లోకేశ్ అందుబాటు-లోకి తెచ్చారు. మనమిత్ర ఇప్పటికే ప్రజాభిమానం చూరగొంటుందని అధికారులు తెలిపారు. నిరక్షరాస్యుల కోసం వాయిస్ మెసేజ్ ద్వారా పనిచేసేలా ఏఐ ఆధారిత చాట్‌బాట్ ఏర్పాటు చేశారు. పౌరులందరూ తమ మొబైల్ ఫోనులో మనమిత్ర నంబరును సేవ్ చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

---------------

# మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శ

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ధర్మేందర్ రెడ్డికి పలువురు పరామర్శ.

మోత్కూరుఏప్రిల్8ప్రజావినికిడి,:: యాదాద్రి జిల్లా మోత్కూరు మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మేందర్‌రెడ్డిని, కుటుంభ సభ్యులను మంగళవారం మాజీ మంత్రి, సిద్ది పేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పరామర్శించారు. ధర్మేందర్‌రెడ్డి తల్లి పిచ్చమ్మ మృతి చెందడంతో మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ,నాయకులు ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, పైళ్ళ శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య,కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కార్పోరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్,స్వామి యాదవ్ , బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అద్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మండల అద్యక్షులు పొన్నెబోయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి,మోత్కూర్ పట్టణ అద్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగ శ్రీను, గజ్జి మల్లేష్, మార్కెట్ మాజీ చైర్మర్ చిప్పలపల్లి



మహేంద్రనాథ్, నాయకులు దాసరి తిరుమలేష్, మాదాను ఆంథోని, పూలపెల్లి జనార్ధన్‌రెడ్డి, అండెం రాజిరెడ్డి, బొనగ నరేందర్‌రెడ్డి,చౌగోని సత్యంగౌడ్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# తిరుపతిలో హైపర్ మాల్స్ ఏర్పాటు

## ముందుకు వచ్చిన లూలు, హయత్ సంస్థలు

### మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



తిరుపతి,ఏప్రిల్8ప్రజావినికిడి,:అతి త్వరలో తిరుపతిలో లూలు మాల్, హయత్ మాల్స్ రానున్నట్లు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కన్నా మిన్నగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని, తిరుపతిలో దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న శెట్టిపల్లి సమీక్ష సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చొరవతో రెవెన్యూ, మున్సిపల్ శాఖ మంత్రులు, సిసిఎల్ఎ, జిల్లా కలెక్టర్ జెసి మున్సిపల్ కమిషనర్లతో, సమీక్ష నిర్వహించి మోడల్ టౌన్షిప్ గా రూపుదిద్దుకునేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే శ్రీ సిటీ నందు రెండవ దఫా భూ కేటాయింపు 2500 ఎకరాలకు కలెక్టర్, జేసి కృషి చేస్తున్నారని, పలు పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా తీర్చి దిద్దుతున్నట్లు- ఆయన పేర్కొన్నారు. ఇక ఒబెరాయ్ హోటల్ ఏర్పాటు-కు ప్రత్యామ్నాయ భూమి కేటాయింపు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం టూరిజం ఒక పరిశ్రమగా గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటు-న్నట్లు- ఆయన తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రోగ్రెసివ్, ప్రో యాక్టివ్ గవర్నమెంట్ గా పనిచేస్తున్నట్లు- ఆయన చెప్పుకొచ్చారు. అలాగే తిరుపతి నందు టిడిఆర్ బాండ్లపై చర్యలు తీసుకుంటామని, తిరుపతి జిల్లా పర్యాటక హబ్ గా ఎదిగేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే తిరుపతి టూరిజం హబ్ గా చేసేందుకు ముఖ్యమంత్రి పూర్తి సహకారం ఉంటుందని.. అలాగే పులికాట్ ముఖ ద్వార పూడికతీతకు 100 కోట్ల రూపాయల నిధులతో పనులు చేపట్టేందుకు కట్టు-బడి ఉన్నట్లు- ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో తిరుపతి జిల్లాలో 34 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానున్నదని ఆయన అన్నారు.అలాగే జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు త్వరలో ఇస్తామని ఆయన అన్నారు. రానున్న వేసవికి తిరుపతి జిల్లాలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రణాళికలు సిద్ధం చేయబోతున్నట్లు- ఆయన తెలిపారు.

# అట్లీ దర్శకత్వంలో బన్నీ సినిమా

అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్స్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్ వచ్చింది. స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ సినిమా చేయనున్నట్లు అధికారికంగా వెల్లడైంది. సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థపై ఇది రానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఆయనకు విషెస్ చెప్పింది. మొత్తంగా అల్లు అర్జున్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. పుష్ప 2 ది రూల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ ఎలాంటి సినిమా చేస్తున్నాడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు మేకర్స్ గుడ్ న్యూస్ చెప్పారు. తమిళ దర్శకుడు అట్లీతో తన తదుపరి ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. అల్లు అర్జున్ 22వ సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్పెషల్ వీడియోను విడుదల చేశారు. పుష్ప' సినిమాతో నేషనల్ అవార్డు అందుకొని అల్లు అర్జున్ ట్రెండ్ సెట్ చేశారు. దీని రెండో భాగం భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో బన్నీ తర్వాత ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. హిట్ దర్శకుడు అట్లీతో ఓ సినిమా చేయనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడిదే విషయాన్ని ఖరారు చేస్తూ సన్ పిక్చర్స్ పోస్ట్ పెట్టింది. ఈ ప్రాజెక్ట్ వివరాలు పంచుకుంటూ ఓ వీడియో విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు వీడియోలో చూపించారు.



అభిమానుల ఊహలకు అందని రీతిలో ఈ సినిమా ఉండనుందని తెలిపారు. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించ నున్నారు. దీని కోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించారు. హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ నిపుణులు మాట్లాడుతూ.. ఇప్పటివరకూ ఇలాంటి స్క్రిప్ట్ ఇప్పటివరకూ చూడలే మొదట అల్లు అర్జున్ ,అట్లీ, నిర్మాత కళానిధి మారన్ కలిసి ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు చూపించిన మేకర్స్.. ప్రీ ప్రోడక్షన్ పనుల కోసం లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించినట్లు చూపించారు. ఇందులోనే అల్లు అర్జున్‌కు స్క్రీన్ టెస్ట్ చేసిన చేయగా.. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్ చూస్తుంటే.. గ్రాఫిక్స్ ప్రధాన పాత్ర పోషించబోతున్నట్లు తెలుస్తుంది.

# జగమెరిగిన సత్యం

## ఏప్రిల్ 18న థియేటర్స్ లో విడుదల

## చిత్ర యూనిట్ కు ఆకాష్ జగన్నాథ్ బెస్ట్ విషెస్..!!

ప్రజావినికిడి,(సినిమా):



అమృత సత్యనారాయణ క్రియేషన్స్ ప్రొడక్షన్ నెంబర్ 1 గా తెరకెక్కిన చిత్రం జగమెరిగిన సత్యం.అచ్చ విజయ భాస్కర్ నిర్మించిన ఈ చిత్రానికి తిరుపతి పాలే దర్శకత్వం వహించారు.అవినాష్ వర్మ ఆద్య రెడ్డి,నీలిమ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్ర షూటింగ్,పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకొని ఏప్రిల్18న థియేటర్స్ లో గ్రాండ్ గా విడుదల కాబోతోంది.విలేజ్ బ్యాక్ డ్రాప్ లో తెలంగాణ నేపథ్యంలో 1994 లో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు తిరుపతి పాలే. ఖర్చుకు ఎక్కడా వెనకాడకుండా నిర్మాత అచ్చ విజయ భాస్కర్ సినిమాను గ్రాండ్ గా నిర్మించారు.సురేష్ బొబ్బిలి అందించిన ఈ చిత్ర పాటలకు మంచి స్పందన లభిస్తోంది.ఈ సందర్భంగా హీరో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ,జగమెరిగిన సత్యం టైటిల్ బాగుంది. సాంగ్స్ ప్రోమోస్ బాగున్నాయి.మంచి కథ కథనాలతో వస్తోన్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని కోరుకుంటున్నాను. సినిమా సక్సెస్ అయ్యి చిత్ర యూనిట్ అందరికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టాలని ఆశిస్తున్నాను అన్నారు.ఏప్రిల్ 18న ఈ సినిమాను అందరూ థియేటర్స్ లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.నటీనటులు:అవినాష్ వర్మ, ఆద్య రెడ్డి, నీలిమ పతకమ శెట్టి తదితరులుడైరెక్టర్:తిరుపతి పాలె నిర్మాత:అచ్చ విజయ భాస్కర్ కెమెరామెన్:షోయబ్ ఎడిటర్: అమర్ రెడ్డిమ్యూజిక్:సురేష్ బొబ్బిలిప్రొడక్షన్ డిజైనర్: శ్రీపాల్ మాచర్లఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:కిరణ్ కుమార్ ఘటకల

# సార్ జాంబి సినిమా పోస్టర్ విడుదల..




ప్రజావినికిడి,(సినిమా): ఎన్ఎన్ రాజు దర్శకత్వంలో నిర్మించిన సార్ జాంబి సినిమా పోస్టర్ ను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ,చిన్న సినిమాలను కూడా ప్రజలు ఆదరించాలాని కోరారు.ఈ కార్యక్రమంలో సినిమా హీరో గుడుగుంట్ల మహేష్,చిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

# గర్ల్‌ఫ్రెండ్ అంటూ ఎవరూ లేరు

## శ్రీలీలతో అఫైర్‌పై ఆర్యన్ కార్తీక్ పరోక్ష సంకేతం

ప్రేమించుకోవడం విడిపోవడం, డేటింగ్ చేయడం, అన్ని కుదిరితే పెళ్ళి చేసుకోవడం సినీ ఇండస్ట్రీలో కామన్. ఇక, హీరో, హీరోయిన్‌లు కలిసి ఓ రెండు సార్లు బయట కనిపించారు అంటే చాలు.. పుకార్లు స్టార్ట్ అవుతాయి.. వాళ్లు ఏ పని మీద మీట్ అయ్యారు అనేది పక్కన పెడితే.. ఇష్టం వచ్చినట్లు ఊహించు కుంటారు. వీటిపై కొందరు రియాక్ట్ అవుతారు మరి కొందరు అస్సలు పట్టించుకోరు. కాగా, ప్రస్తుతం బాలీవుడ్‌లో గత కొన్ని రోజులుగా హీరో కార్తిక్, నటి శ్రీ లీలతో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే, అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తిక్ ఆర్యన్ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ షూటింగ్ సమయంలో కార్తిక్– శ్రీ లీల మధ్య మంచి పరిచయం ఏర్పడింది.. ప్రస్తుతం వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. దీనిపై వీరిద్దరూ ఎక్కడా కూడా స్పందించలేదు. తాజాగా ఓ హిందీ ఛానల్ తో ముచ్చటించి కార్తిక్ ' ఇండస్ట్రీలో నేను ఒక్కడినేనా.. ఇంకా చాలా మంది ఉన్నారు.. వారి గురించి ఎవరూ ఇలాంటివి రాయరు.. నా గురించి మాత్రమే అందరూ పిచ్చి వార్తలు రాస్తుంటారు అని మండిపడ్డారు. ఇక, ఇక్కడ నన్ను సపోర్ట్ చేయడానికి ఎవరూ లేరు అని కార్తిక్ ఆర్యన్ అన్నాడు. బాగా వినండి అందరికీ చెబుతున్నా.. ఇండస్ట్రీలో నాకు సినీ బ్యాగ్రౌండ్ లేదు, సోదరులు, స్నేహితులు, గర్ల్ ఫ్రెండ్ ఎవరు లేరని తేల్చి చెప్పాడు. వీటిని నిరూపించుకోవాల్సిన అవసరం నాకు లేదు.. ఎందుకంటే ఇలాంటి అబద్ధపు పుకార్లు పుట్టించే వారు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు అంటూ పరోక్షంగా శ్రీ లీలతో డేటింగ్ మ్యాటర్ కి ఫుల్‌స్టాప్ పెట్టాడు కార్తిక్ ఆర్యన్.



## అఖిల్ కొత్త మూవీ..

# లెనిన్ గ్లింప్స్ అదుర్స్..



టాలీవుడ్ యంగ్ హీరో అఖిల్ కెరీర్ లో మంచి హిట్ కొట్టాలని ఎప్పటి నుంచో వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. గత చిత్రం ఏజెంట్ మూవీ భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా.. అనుకున్న స్థాయిలో అఖిల్ మెప్పించలేకపోయారు. దీంతో తన అప్ కమింగ్ మూవీస్ పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. కథల విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నారట.ఇప్పుడు రెండేళ్ల తర్వాత గుడ్ న్యూస్ చెప్పారు అఖిల్. తన కొత్త మూవీని అనౌన్స్ చేశారు. బర్త్ డే సందర్భంగా ఆ సినిమా గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. వినరో భాగ్యము విష్ణు కథతో ఇప్పటికే మూవీ లవర్స్ ను మెప్పించిన మురళీ కిషోర్ అబ్బూరు.. అఖిల్ కొత్త మూవీని తెరకెక్కిస్తున్నారు. ఎప్పటి నుంచో టాక్ వస్తున్నట్లు లెనిన్ అనే టైటిల్ నే ఫిక్స్ చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ తో పాటు సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న లెనిన్ లో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. రాయలసీమ బ్యాక్ డ్రాప్ తో రూపొందుతున్న లెనిన్ మూవీ గ్లింప్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అందరినీ ఆకట్టుకుని దూసుకుపోతోంది. స్టన్నింగ్ విజువల్స్ తో గ్లింప్స్ స్టార్ట్ అవ్వగా.. రథం ఎంట్రీ ఇచ్చింది. అప్పుడే మాస్ లుక్ లో అఖిల్ చేతిలో ఆయుధంతో నడుస్తూ కనిపించారు. గతాన్ని తరమటానికి పోతా.. మా నాయిన నాకో మాట సెప్పినాడు. పుట్టేటప్పుడు ఊపిరి ఉంటాదిరా పేరు ఉండదు. అట్నే పోయేటప్పుడు ఊపిరి ఉండదు పేరు మాత్రమే ఉంటాది. ఈ పేరు ఎట్లా నిలబడాలి అంటే అంటూ ఓ రేంజ్ లో సాగింది గ్లింప్స్. ఆ తర్వాత అఖిల్, శ్రీలీలను రివీల్ చేశారు మేకర్స్. మాస్ లుక్ లో హీరో ఉండగా.. ఆయనను చేతిని పట్టుకుని హీరోయిన్ నిలబడి ఉన్నారు. అనంతరం హ్యాపీ బర్త్ డే అంటూ విషెస్ చెప్పారు మేకర్స్. ప్రేమ కంటే హింసాత్మకమైనది యుద్ధం కాదని అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అయితే గ్లింప్స్ బట్టి.. మూవీ రూరల్ లవ్ డ్రామాగా క్లియర్ గా తెలుస్తోంది. అయితే లెనిన్ మూవీకి గాను అఖిల్ ఫుల్ గా మేకోవర్ చేసుకున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. మాస్ లుక్ ఆయనకు బాగా సెట్ అయినట్లు కనిపిస్తోంది. శ్రీలీల కూడా క్యూట్ గా కనిపిస్తున్నారు. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుండగా.. ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్ గా ఉన్నాయి. మొత్తానికి రెండేళ్ల తర్వాత మూవీ అనౌన్స్మెంట్ రాగా.. గ్లింప్స్ అదిరిపోయిందని అందరూ చెబుతున్నారు.



# బిజీగా ఉంటేనే ప్రశాంతంగా ఉంటా

తెలుగు ప్రేక్షకులకు రకుల్ ప్రీత్ సింగ్ గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. దాదాపు తెలుగు అగ్ర హీరోలందరితోనూ నటించిన రకుల్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఈ మధ్య రకుల్ పెద్దగా ఫామ్ లో లేకుండా పోయింది. రకుల్ నటించిన ఇండియన్2, మేరే హస్బెండ్ కీ బీవీ సినిమాలు అంచనాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం అజయ్ దేవగణ్, మాధవన్ లీడ్ రోల్స్ లో వస్తోన్న దే దే ప్యార్ దే2 లో నటిస్తోన్న రకుల్, నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న రామాయణంలో కూడా నటించనుందని వార్తలొస్తున్నాయి. భాషతో సంబంధం లేకుండా తనకు నచ్చిన పాత్రలన్నీ చేసుకుంటూ వెళ్తున్న రకుల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది.ఎవరైనా సరే తమ కెరీర్లో ఉన్న ఫ్లాపుల గురించి మాట్లాడటానికి పెద్దగా ఇంట్రెస్ట్ చూపించరు. కానీ రకుల్ మాత్రం ఎలాంటి మొహమాటం లేకుండా ఫ్లాపుల గురించి మాట్లాడుతుంది. హిట్టూ ఫ్లాపుతో పాటూ బాక్సాఫీస్ వద్ద సక్సెస్సే కీలకమైన ఈ రోజుల్లో రకుల్ నిజాయితీగా ఫ్లాపుల గురించి మాట్లాడటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇండస్ట్రీలో హిట్టూ, ఫ్లాపులు చాలా కామన్ అని చెప్తున్న రకుల్, జీవితంలో మార్పులు చాలా సహజమని ఎన్ని కష్టాలొచ్చినా డబుల్ ఎనర్జీతో వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలని, అలా చేయాలంటే ముందుగా మనమీద మనకు నమ్మకముండాలని అప్పుడే ఏదైనా సాధ్యమవుతుందని రకుల్ అభిప్రాయపడింది. . తన గురించి చెప్తూ, పనిలో ఎంత బిజీగా ఉంటే అంత ప్రశాంతంగా ఉంటానని చెప్తోన్న రకుల్, షూటింగ్ లేకుండా ఖాళీగా ఉంటే ఎంతో ఒత్తిడికి గురవుతుంటానని తెలిపింది. వరుస షూటింగ్స్ లో తన షెడ్యూల్ నిండిపోయి ఉంటే తనకెంతో ఆనందంగా, ప్రశాంతంగా ఉంటుందని చెప్తోన్న రకుల్ ప్రతీ రోజూ కెమెరా ముందుకు ఎదుర్కోవడం తన లైఫ్ లో రొటీన్ గా మారిపోయిందని, ఈ లైఫ్ స్టైలే తనను మంచి పొజిషన్ కు తీసుకెళ్లిందని, ఇది ఇలానే కంటిన్యూ అవాలని కోరుకుంటున్నట్టు రకుల్ తెలిపింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613